క్లుప్తంగా

పురుగు మందుల వినియోగం తగ్గించాలి



శ్రీరంగపట్నంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

మధురపూడి: సాగులో ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గిస్తేనే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో పొలం బడి కార్యక్రమంలో భాగంగా రైతులకు క్షేత్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాధవరావు మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వాడే విధానాన్ని, పచ్చిరొట్ట ఎరువులతో కలిగే ప్రయోజనాన్ని వివరించారు. రైతులు ఆరోగ్యకరమైన పంటలు పండించడం ద్వారానే సమాజాభివృద్ధి సాధించవన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ డీఆర్‌సీ, ఏడీ జయరామలక్ష్మి, కోరుకొండ ఏడీ మల్లికార్జునరావు, ఏఓ గౌరీదేవి, వారా ప్రవీణ్, ఆత్మ ఏటీఎం జయశ్రీ పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



బొబ్బిల్లంకలో సారా డబ్బాను పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

సీతానగరం: బొబ్బిల్లంకలో సారా బట్టీలపై దాడి చేసినట్లు సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆ గ్రామ లంక భూముల్లో సారా బట్టీలపై దాడి చేసి 400 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఐదు వేల లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు వస్తున్నారని గమనించిన సారా తయారీ బట్టీ నిర్వాహకులు పరారయ్యారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ వివరించారు.

సాంబశివరావుకు పీహెచ్‌డీ



వీసీ ఆచార్య పద్మరాజు నుంచి పీహెచ్‌డీ పత్రాన్ని అందుకుంటున్న సాంబశివరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.సాంబశివరావు వీసీ ఆచార్య కె.పద్మరాజు చేతుల మీదుగా పీహెచ్‌డీని శుక్రవారం అందుకున్నారు. ద్రవిడ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్‌కేఎం బాబూరావు చౌదరి పర్యవేక్షణలో 'తూర్పు గోదావరి జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యంపై ఒత్తిడి – ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ద్రవిడ యూనివర్సిటీ (కుప్పం) ఆయనకు పీహెచ్‌డీ అందజేసింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో తెలుగు పరీక్షలకు 586కు 567 మంది పరీక్ష రాశారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. 19 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తెలుగు, సంస్కృతం పరీక్షలకు 34 మంది గైర్హాజరయ్యారు. మండలంలోని వివిధ కళాశాలలకు చెందిన 403 మంది విద్యార్థులకు 369 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 102 మందికి 98 మంది వచ్చారు. ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసింది. దీనికి చీఫ్ సూపరింటెండెంట్‌గా రామకృష్ణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా సురేష్ వ్యవహరించారు.

డిజిటల్ లావాదేవీలు జరపాలి

బిక్కవోలు: పంచాయతీలు నిర్వహించే లావాదేవీలు అన్నీ నగదు రహితంగా ఉండాలని, ఎక్కడా నగదు వాడవద్దని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం బిక్కవోలు పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆర్థిక లావాదేవీలు డిజిటల్ రూపంలోనే ఉండాలని ఆదేశించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని కూడా స్పష్టం చేశారు. డిజిటల్ రూపంలో లావాదేవీల వల్ల ఎలాంటి అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ బి.భవాని, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

సస్యరక్షణే శ్రీరామ రక్ష

- వరి సాగు సమగ్రంగా చేపడితేనే అధిక దిగుబడులు
- వ్యవసాయాధికారుల సూచనలూ కీలకం
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 57,442 ఎకరాల్లో పంట



పుట్టకొండలో తెగుళ్ల నివారణకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెదపూడి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంటలో రైతులు సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య చర్యలు సకాలంలో చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చంటున్నారు వ్యవసాయ నిపుణులు. సరైన సూచనలు పాటించి సాగు చేయడంతో రైతుకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వరిని ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ సస్యరక్షణ చర్యలతోనే సాధ్యమవుతుందని తెలిపారు.

57,442 ఎకరాల్లో వరి సాగు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917, రాజానగరంలో 8,060 ఎకరాల్లో వరి సాగవుతోంది.

పెదపూడి మండలంలో..



టీవీఆర్.మణిదీప్

ప్రస్తుతం పెదపూడి మండలంలో వరి పంట ఈనిక దశలో ఉంది. చింతపల్లి, కుమారప్రియం తదితర గ్రామాల్లో పొట్ట కుళ్లు తెగులు, గంగ్రేడు, పుట్టకొండ, పెదపూడి గ్రామాల్లో కాండం తొలుచు తెగులు ఉంది. పెదపూడి మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ ఆయా తెగుళ్ల సోకే విధానం, నివారణ చర్యలు వివరించారు.

పొట్ట కుళ్లు తెగులు

పొట్టను అంటిపెట్టుకుని ఉన్న ఆకు పైభాగం మీద ప్రాథమిక లక్షణాలు కనిపిస్తాయి. మచ్చలు ఏర్పడి, చుట్టూ ముదురు గోధుమ రంగులో ఉండి, మధ్యలో బూడిద వర్ణం కలిగి ఉంటుంది. మచ్చలు ఒకదానితో ఒకటి కలిసి, పొట్ట అంతా వ్యాపించి, వెన్ను బయటకు రాకుండానే లోపల కుళ్లిపోతుంది.

నివారణ చర్యలు

- పంట కాలంలో ఒకసారి సూడోమోనాస్ శిలీంధ్ర నాశిని పిచికారీ చేయాలి.
- సస్యరక్షణ ప్రొఫికోనోజోల్ ఒక మి.లీ. లేదా కార్బండజం 25 శాతం, మాంకోజబ్ 50 శాతం మిశ్రమాన్ని రెండు గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగు

ఈ పురుగులు వరి పంటలో పిలకలు పెట్టే దశ నుంచి , చిరుపొట్ట దశ వరకు ఆశిస్తాయి. పిలకల దశలో ఆశిస్తే మొవ్వు చనిపోతుంది. దీనిని డెడ్ హార్ట్ అంటారు. చిరుపొట్ట దశలో కంకి బయటకు వచ్చే దశలో ఆశిస్తే గింజలకు పోషక పదార్థాలు అందక, తాలు గింజలుగా మారి, తెల్లకంకి ఏర్పడుతుంది.

నివారణ చర్యలు

- నాటడానికి ముందు నారు కొనలు, చివర్లు తుంచి గుడ్ల సముదాయాన్ని నాశనం చేయాలి.
- లింగాకార్షణ బుట్టలు పెట్టాలి.
- సాయంత్రం వేళల్లో పొలం గట్లపై మంటలు వేసి, తల్లి పురుగులను నాశనం చేయాలి.
- పొలం గట్లపై పసుపు రంగు పూల మొక్కలైన బంతి, చామంతి నాటడంతో, తల్లి పురుగులు ఆకర్షించబడి తమ గుడ్లను పూలలో పెట్టడంతో, ప్రధాన పొలంలో పురుగు ఉధృతిని గణనీయంగా తగ్గించవచ్చు.
- పిలకలు పెట్టే దశ నుంచి చిరు పొట్ట దశ వరకు క్లోరాంత్రనిలిప్రోల్ 0.4 శాతం (ఫెర్టెరా) గుళికలు ఎకరాకు 4 కేజీల చొప్పున వేయాలి.
- తల్లి పురుగు ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంత్రనిలిప్రోల్ 18.5 శాతం(కోరాజిన్) ఎకరాకు 60 మి.లీ. పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు

దుబ్బులో రెండు, మూడు పిలకలు వాడిపోయి, క్రమేణా పిలకలు మొత్తం ఎండిపోతాయి. తెగులు సోకిన పిలకల్లో కణజాలం కుళ్లడంతో, పిలకలు మెత్తబడి పైరు నేలపై వాలిపోతుంది.

నివారణ చర్యలు

- పంట కోత తర్వాత వేసవి సమయంలో లోతు దుక్కులు చేయాలి.
- పొలంలో మురుగునీరు నిల్వలేకుండా చూడాలి.
- మూడో పంటగా అపరాలు తప్పక సాగు చేయాలి.
- ఒక పొలంలో నీరు.. మరో పొలంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- తెగులు తరచూ వచ్చే పొలాల్లో నేరుగా విత్తే పద్ధతి అవలంబించాలి.
- పంట కాలంలో ఒకసారి సూడోమోనాస్ శిలీంధ్ర నాశిని పిచికారీ చేయాలి.
- టేబుకోనాజోల్ (పోలికర్) 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొడ లేక పాము పొడ తెగులు

వరి మొక్క పిలకలు పెట్టే దశ నుంచి ఎప్పుడైనా ఈ తెగులు వరిని ఆశించవచ్చు. ఈ శిలీంధ్రం వల్ల ఆకులపై చిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. అవి క్రమేపీ పెరిగి పాము పొడ వంటి మచ్చలుగా మారతాయి. మచ్చల చుట్టూ గోధుమ వర్ణం కలిగి, మధ్య భాగం బూడిద రంగులో ఉంటుంది. తెగులు ముందుగా పొలం గట్లపై ఉన్న కలుపు మొక్కలకు ఆశించి, క్రమేపీ ప్రధాన పొలంలోకి వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

- విత్తన శుద్ధి విధిగా చేయాలి.
- నత్రజని ఎరువులను రెండు దఫాలుగా వేయాలి.
- గడ్డిజాతి కలుపు మొక్కలను తీసివేసి, పొలం గట్లు శుభ్రంగా ఉండేలా చూడాలి.
- అజాక్సి స్ట్రోబిన్ 25 ఎస్‌సీ(అమిస్టర్) ఒక లీటరు నీటికి ఒక మి.లీ. చొప్పున పిచికారీ చేయాలి. లేదా అజాక్సిస్ట్రోబిన్ 11 శాతం, టేబుకొనజోల్ 18.3 ఎస్‌సీ (కస్టోడియా) ఒక లీటరు నీటికి 1.5 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలి.
- తెగులు తొలి దశలో శిలీంధ్ర నాశిని మందులు పొలం గట్లపై పిచికారీ చేయడంతో తెగులును ప్రధాన పొలంలోకి వ్యాపించకుండా అరికట్టవచ్చు.

కోటపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష



కోటపాడులో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి పర్యవేక్షణలో కోటపాడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ప్రత్యేక వైద్యాధికారులు కేవీపీ పూజిత, పి.శశాంక్, నేత్ర వైద్య నిపుణులు సత్యప్రసాద్ 311 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు, ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకర అప్పారావు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ గవరసాని వెంకటరమణ, కార్యదర్శి మణికుమార్, సీహెచ్ఓ కె.జయమణి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పెదపూడి: ఓటు హక్కు చాలా విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకటరమణ అన్నారు. పుట్టకొండ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ కోడ్16లో ఓటు హక్కుపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీహెచ్ఆర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి చిన్ని, బీఎల్ఓ శివదుర్గ, ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, హెచ్ఎం మెహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- సీఎం జగన్‌తోనే సాధ్యం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కానవరం జగనన్న కాలనీలో లబ్ధిదారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కానవరంలోని జగనన్న కాలనీలో జరిగిన గృహ ప్రవేశాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. కానవరంలో 290 మందికి ఇళ్ల స్థలాలు అందజేశారు. మిగిలిన నిర్మాణాలు కూడా త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవసరమైన తోడ్పాటు అందించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. గత ఎన్నికల ముందు ప్రజా సంకల్ప యాత్ర సమయంలో సొంతిల్లు లేక పేదలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సొంతిల్లు కట్టుకోవాలనే వారి కలకు కార్యరూపాన్ని ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ఒకేసారి 31.5 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా, అందులో ఇల్లు కట్టుకునేందుకు రూ. 1.80 లక్షల ఆర్థిక సాయాన్ని కూడా అందిస్తున్నారన్నారు. ఈ విధంగా జగనన్న కాలనీల పేరుతో ఏకంగా ఊళ్లే ఏర్పడేలా చేసి, ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కోడి వీరరాఘవ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.శ్రీరామకృష్ణ, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రామచంద్రపురం ఏటిగట్టుపై చెట్లను ఢీకొని ఆగిన ఆర్టీసీ బస్సు

సీతానగరం: ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నంకు ఆర్టీసీ బస్ బయలు దేరింది. సింగవరం నాగరత్న కాలనీ నుంచి పురుషోత్తపట్నం వరకూ ఏటిగట్టుపై బస్ వెళ్తుంది. రామచంద్రపురం శివారు స్టేజ్ వద్ద ఒక ప్రయాణికుడు దిగడానికి బస్సును ఆపమని కోరగా, నిలిపేందుకు ప్రయత్నించినా బ్రేక్‌లు పడకపోవడాన్ని డ్రైవర్ గుర్తించాడు. డ్రైవర్ తెలివిగా వ్యవహరించి బస్సును దట్టంగా ఉన్న చెట్ల వద్దకు తీసుకువెళ్లి వాటిని ఢీకొట్టి నిలిపివేయడంతో అందులోని పది మంది ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. తర్వాత రామచంద్రపురం నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలోని పురుషోత్తపట్నానికి ప్రయాణికులు ఆటోలో తరలివెళ్లారు. చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్‌ను పలువురు అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ



వెయిట్ లిఫ్టింగ్‌లో బ్రాంజ్ మెడల్స్ అందుకున్న విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ పద్మరాజు

రాజానగరం: ఆల్ ఇండియా అండ్ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థినులు సత్తా చాటారు. డీఆర్‌కే రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ (కాకినాడ)లో డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫస్టియర్ చదువుతున్న వెయిట్ లిఫ్టర్లు, అక్కాచెల్లెళ్లు బైరెడ్డి రాజేశ్వరి, చంద్రికలు వెయిట్ లిఫ్టింగ్‌లో బ్రాంజ్ మెడల్స్ సొంతం చేసుకున్నారు. ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 45 కిలోల కేటగిరీలో బైరెడ్డి రాజేశ్వరి, ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ 49 కిలోల కేటగిరీలో బైరెడ్డి చంద్రిక ఈ ఘనతను సాధించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో యూనివర్సిటీకి రెండు మెడల్స్ సాధించడం హర్షణీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని అత్యుత్తమ విజయాలను అందుకోవాలనే ఆకాంక్షించారు. విజేతలు, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కోచ్‌ను వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ బి.రామ్‌గోపాల్, పీడీ డాక్టర్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో ఆర్థికాభివృద్ధి



గాడాలలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

మధురపూడి: పాల డెయిరీ మహిళా సహకార సంఘాలతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. శుక్రవారం గాడాలలో అమూల్ మిల్క్ కలెక్షన్ యూనిట్ (ఏఎమ్‌సీయూ)ను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూపు మహిళలను ఉద్దేశించి జేసీ మాట్లాడుతూ మహిళలు డెయిరీల నిర్వహణ ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. ఇందులో భాగంగా గాడాలలో మహిళా డెయిరీ సహకార సంఘంగా నిర్వహించాలని వారిని కోరారు. పాల సేకరణ పెరిగేందుకు పాడి రైతులకు అవగాహన పెంచాలన్నారు. పాడి రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఏడీ పి.ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి సత్యానందకుమార్, ఆర్ఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 79.27 శాతం పింఛన్ల పంపిణీ



పందలపాకలో వృద్ధుడికి పింఛను అందిస్తున్న వలంటీర్, గృహ సారథి

బిక్కవోలు: మండలంలో తొలిరోజు 79.27 శాతం పింఛను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం 10,912 పింఛన్లకు 8,650 మందికి అందించారు. గృహ సారథుల సమక్షంలో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలకం

రాజానగరం: దేశాభివృద్ధిలో యువత కీలకం కావాలని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాలేజీలో శుక్రవారం మాక్ యూత్ పార్లమెంట్ నిర్వహించారు. జిల్లా యువజన అధికారి దూలం కిశోర్ మాట్లాడుతూ యువతలో వ్యక్తిత్వ వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు.

డీఎల్‌పీఓ విచారణ

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో లోకాయుక్తకు వచ్చిన ఫిర్యాదుపై డీఎల్‌పీఓ నాగలత శుక్రవారం విచారణ చేశారు. అంబటిపేటకు చెందిన బొట్టా అప్పారావు తన వీధిలో ఆక్రమణలు తొలగించాలని లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. విచారణలో ఈఓపీఆర్డీ బి.భవాని, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.